రాత్రి మంచు దుప్పటి కప్పుకుని నక్షత్రాల్ని లెక్కిస్తోంది. నక్షత్రాలు ఆ మంచు దుప్పటిని చీలుస్తూ, నిశితంగా మానవ లోకాన్ని పరిశీలించాలనే ఉబలాటంతో ఉన్నాయి.

ఆ ఉబలాటాన్ని గమనిస్తున్న రెండు అందమైన కళ్ళు పార్వతివి!

అలా గుమ్మంలో కూర్చుని, దీపావళి మర్నాటినుండీ విజృంభించే చలికాలానికి స్వాగతం చెప్పటం పార్వతికి చాలా ఇష్టం. పల్చపల్చగా ఆరంభమై, క్రమంగా దట్టంగా అల్లుకుపోయే మంచు దుప్పటిలోంచి దోబూచులాడే నక్షత్రాల్ని చూస్తూంటే - కళ్ళముందు కరిగిపోయిన గతం మళ్ళీ మనసులో మెదుల్తూ, రక రకాల అనుభూతులకు గురి చేస్తూంటుంది.

అందులో కొన్ని తియ్యనివి!

మరికొన్ని పుల్లనివి!

పార్వతి ఓ మాటు ఇంట్లోకి తొంగి చూసింది.

పెద్దబాబు దీపం ముందు కునికిపాట్లు పడుతున్నాడు. పాప నోట్లో వేలు వేసుకుని గోడమీదకి ఒరిగి హాయిగా నిద్రపోతోంది. పసివాడు నిద్రలో గురక కొడుతున్నాడు.

లేచి వెళ్ళి, చాపమీద పక్క సరిచేసి పిల్లల్ని సరిగా పడుకోబెట్టి వచ్చి మళ్ళీ గుమ్మంలో కూర్చుంది.

వెన్ను తలుపురెక్కకి ఆన్చింది.

ఇప్పుడు అటు నక్షత్రాలూ, ఇటు పిల్లలూ కనిపిస్తున్నారు.

చిన్నప్పుడు విన్న ధృవుడి



# దుప్పటి

– కాటూరి రవీంద్ర త్రివిక్రమ్

కథ గుర్తొచ్చింది.

నిజంగా ఆ కథ జరిగిందో లేదో గానీ, తాతయ్య చూపిన తడాదీ ఇంతవరకూ ధృవనక్షత్రం ఎక్కడుంటుందో తను మర్చిపోలేదు!

ఆ కథలో ధృవుడి పట్టుదల ప్రధాన విషయం, ఆదర్శం-అని టీచరు తాతయ్య నూరి పోసేవాడు.



నవ్వొచ్చింది.

అప్పటి తాతయ్యలే వేరు.

వాళ్ళకెంతో శ్రద్ధ - ఓపిక! ఎన్నెన్నో నీతి కథలు చెప్పేవాళ్ళు. అమ్మమ్మలు, నాయనమ్మలు రాత్రి తరగతులు నిర్వహించే టీచర్లులా పిల్లలను ఊరించేట్లు కథలల్లి చెప్పేవాళ్ళు.

చందమామ మీద ఓ కథ.

అందులో రాట్నం వడికే అవ్వ మీద ఓ కథ.

అడవిలో వేటాడే రాకుమారుడు, పేదరాసి పెద్దమ్మ, రాక్షసుడి గుహ- అందులో అందమైన రాకుమార్తె....ఓహ్ - ఎన్నెన్ని అద్భుతమైన కథలు!

వాళ్ళేమి చెప్పినా అందులో కమ్మదనం, గమ్మత్తు కనిపించేవి.

ఈ నైపుణ్యం వాళ్ళు తల్లులుగా ఉన్నప్పటినుండీ అలవరచుకుని ఉండాలి.

లేకపోతే-స్విచ్చి వేస్తే వెలిగే దీపంలా ఒక్క క్షణంలో ఆ ప్రావీణ్యం అబ్బటం అసంభవం.

కానీ-ఇప్పటి తల్లిదండ్రులలో!

అనుకునే పనే లేదు.

జీవన సమరంలో డస్సిపోయి విసుగు, చికాకుతో పిల్లల్ని కసురుకుంటారు. ఇప్పుడే వీళ్ళకి ఓపిక లేదు.

ఇక అమ్మమ్మలూ, తాతయ్యలయ్యాక ఏముంటుంది?

వీధిగేటు చప్పుడికి ఉలిక్కిపడి అటు చూసింది పార్వతి. భర్త విశ్వనాథం లోపలికి వచ్చి గేటు వేసాడు. పార్వతి లోపలికి వెళ్ళి కాళ్ళకు నీళ్ళు తెచ్చింది.

వాటిని అందుకోకుండా, "కడుక్కుంటాలే - ముందు ఇలా రా!" అంటూ దీపం దగ్గరకి తీసుకెళ్ళి చేతిలో ప్యాకెట్ విప్పదీసాడు. పార్వతి కుతూహలంగా చూస్తోంది.

దుప్పటి!

ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"నెల మధ్యలో ఎలా తీసుకొచ్చారు? అప్పు చేశారా?"

"ముందు ఎలా ఉందో చెప్పు? తర్వాత మిగతా సంగతులు చెబుతాను" అన్నాడు మడతలు విడదీస్తూ విశ్వనాథం.

"దుప్పటికేం? అద్భుతంగా ఉంది. మందంగా, బరువుగా మంచి డిజైన్‌లో-బావుంది. ఇక పిల్లలకి చలి భయం లేదు. పల్చటి దుప్పటితో చలికాలం ఎలా గడుస్తుందా అని భయపడిపోయాను!" ప్రశంసగా చూస్తూ అంది పార్వతి.

విశ్వనాథం మొహం తృప్తితో నిండిపోయింది.

"ఇది ఒక అరవతను మద్రాసు నుండి చవగ్గా తెచ్చాడు."

"ఎవరతను? మీ ఆఫీసులో పని చేస్తున్నాడా?"

"కాదు—పూర్వం ఏదో ఆఫీసులో పని చేసేవాట్ట. ఎమర్జెన్సీ గొడవల్లో ఉద్యోగం పోయింది. తర్వాత, ఈ వ్యాపారంలోకి దిగాడు. గవర్నమెంటు ఆఫీసుల కెళ్ళి ఉద్యోగులకి అమ్ముతుంటాడు. మా ఆఫీసుకి చాలా మాట్లు వచ్చాడు. కానీ, నేనే ఎప్పుడూ పెద్ద ఆసక్తి చూపించలా. ఈ రోజు తనే నా సీటు దగ్గరికొచ్చి, 'మీరు కూడా ఒకటి తీసుకోండి సార్. ఇది లాస్ట్ పీస్. డబ్బులు తర్వాత ఇవ్వండి, ఫర్వాలేదు' అని అంటగట్టేశాడు. ఎలాగూ మనకి అవసరం కదాని కాదనలేక పోయాను." నవ్వేడు.

పార్వతి దుప్పటిని ఆప్యాయంగా తడిమి చూసింది.

అల్లిక బావుంది....పడవ బొమ్మల డిజైను.

కొత్త దుప్పటి వాసన నాసికకు ఇంపుగా ఉంది.

విశ్వనాథం అప్రయత్నంగా పిల్లలకేసి చూశాడు. ఆదమరచి నిద్రపోతూన్న వాళ్ళ మొహాల్లోని అమాయకత్వం చూస్తూంటే, ప్రేమ

పొంగుకువచ్చింది.

"పార్వతీ! ముందు ఈ దుప్పటి పిల్లలమీద కప్పు. దీని వెచ్చదనం అనుభవిస్తూ హాయిగా వాళ్ళు నిద్ర పోతూంటే చూడాలని ఉంది."

పార్వతికి నవ్వు తోసుకు వచ్చింది.

"ఎంత భావుకులండీ మీరు! ఒక్కో మాటనుకుంటుంటాను—ఎక్కడో ఏదో పొరపాటు జరిగి మీరు రచయిత కావటం తప్పి పోయిందని."

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్! ముందు నేను చెప్పిన పని చేస్తావా?"

"అబ్బబ్బ! మీకు ఆనాటి నుండి ఈనాటి వరకూ అదే తొందర.... అదే ధోరణి. నోట్లో మాట నోట్లో ఉండగానే పనులు జరిగిపోవా లనుకుంటారు." చిరుకోపంనటించింది.

"నీకింకా 'ఆనాడు' గుర్తుందా?" చిలిపిగా ప్రశ్నించాడు.

"ఏ నాడు?" ఏమీ తెలియనట్లు గడుసుగా ఎదురు ప్రశ్నించింది.

"తొలినాడు!"

"ఛ- ఊరుకోండి. ముగ్గురు బిడ్డల తండ్రి అయినా మీకు సిగ్గు లేదు."

"సిగ్గా?!" నవ్వాడు. "పిల్లలు కలిగినందుకు గర్వించాలి గానీ సిగ్గెందుకోయ్! మనమేమన్నా పెళ్ళి చేసుకోకుండా పిల్లల్ని కన్నామా?"

"మీ జోక్‌లు చాలుగానీ.... ముందు కాళ్ళు. కడుక్కురండి. ఇప్పటికే ఆలస్యమైంది భోజనానికి."

"ఇంతకీ నా కోరిక తీర్చ నంటావ్?"

"మీ కోరిక తీర్చకపోతే నిద్ర పోతారా పాపం!" వ్యంగ్యంగా అని పిల్లల మీద కొత్త దుప్పటి కప్పింది.

ఇప్పుడు డిజైన్ మరింత కొట్టొచ్చినట్లు కనుపిస్తోంది.

తృప్తిదీరా చూసుకుని, "ఎస్, వెరీ నైస్" అని కాళ్ళు కడుక్కో నేందుకు వెళ్ళాడు విశ్వనాథం.

* * *

కూనిరాగం తీస్తూ ఎండలోంచి ఆరిన బట్టలు తీసి భుజాన వేసుకుని ఇంట్లోకి వచ్చింది పార్వతి.

అల్లరి చేస్తున్న పిల్లల్ని గట్టిగా మందలించి బట్టలు మడత బెట్టటంలో నిమగ్నమైంది.

అన్నీ పూర్తయినా ఏదో 'వెలితిగా' అనిపించింది.

ఏమిటది?

చప్పున గుర్తొచ్చి గుండెలు గుభేలుమన్నాయి.

దుప్పటి!

అవును...కొత్త దుప్పటి ఏది? చంటివాడు ఖరాబు చేస్తే శుభ్రంగా పిండి, మిరమిరలాడే ఎండలో ఆరేసింది. బట్టలన్నీ ఉండగా కొత్త దుప్పటి ఏమౌతుంది?

గబగబ బయటకెళ్ళి కళ్ళతో గాలించింది.

బోసిగా ఉన్న తాడు వెక్కిరించింది.

అక్కడే-అవును- ఆ తాడు మధ్యలోనే ఆరేసింది!

ఏమై పోయింది?

ఓ మాటు చెక్కగేటు కేసి చూసింది.

ఓరగా తీసి ఉంది. కాళ్ళు చల్లబడినట్లనిపించింది. తను లోపల పనిలో ఉన్నప్పుడు ఏ దొంగ వెధవో ఎత్తుకెళ్ళి ఉంటాడు!

భగవాన్! ఇప్పుడెలా? ఇంకా ఆయన దుప్పటి అప్పు కూడా తీర్చలేదు. ఈ ధరలు పెరిగిన రోజుల్లో అతికష్టం మీద ఎన్నో కలలు కని అప్పు మీద తీసు కొచ్చిన దుప్పటి! పట్టుమని పది రోజులు కూడా కాలేదు. దేవుడా! దోమల్నీ, నల్లుల్నీ, తేళ్ళనీ, చివరికి పాముల్నీ భరించవచ్చుగానీ-యీ దొంగల్ని భరించమని మమ్మల్నెందుకు శపించావ్? మనిషిబుద్ధి కిలాంటి శాశ్వతమైన మచ్చ ఎందుకు పెట్టావ్?

ఈ రోజు ఆయన మొహం ఎలా చూడగలను? ఏమని చెప్పగలను?

అసలే చలికాలం! ఈ మాటు పిల్లలు హాయిగా వెచ్చగా కాలక్షేపం చేస్తారు కదాని తృప్తిపడింది.

అనుకున్నంత సేపు పట్టలేదు..

ఎలా మనసొప్పిందో వాడికి?

మళ్ళీ అంతలోనే అనుమానం వచ్చింది.

తనసలు నిజంగా దుప్పటి ఆరేసిందా? లేక ఇంట్లోనే ఉంచుకుని భ్రమ పడుతోందా?

గబగబ ఇంట్లోకి వెళ్ళి అన్ని మూలలా గాలించింది. పాతగుడ్డల మూట-ఇస్త్రీ బట్టల బుట్ట, పెట్టెల సందుల్లో-ఉహూఁ.... లేదు!

అలసటగా కూలబడింది.

నుదుటి మీద చెమట పట్టింది భయంతో.

ఇంకేపనీ చెయ్యాలనిపించలేదు.

మనసంతాపచ్చిపుండులా ఉంది.

ఈ రోజు చాలా దుర్దినం!

ప్రతి రోజూ ఎంతో ఆశగా భర్త కోసం నిరీక్షించే మనసు, ఈ రోజు భయంతో ముడుచుకుపోతోంది.

ఏ చిన్న శబ్దం అయినా భర్తే వచ్చాడేమోననిఉలిక్కిపడసాగింది.

మాటి మాటికీ వీధి గేటు వైపు చూస్తోంది. మళ్ళీ తల తిప్పి దిగులుగా పిల్లల కేసి చూస్తోంది.

'ఈ చలికాలం వీళ్ళ కెలా?' ముల్లులా మనసుని గుచ్చుతోంది ప్రశ్న.

చెక్కగేటు చప్పుడయింది.

అదిరి పడుతున్న గుండెలతో అటు చూసింది. భర్తే! మెల్లగా చెక్కగేటు మూసి, పై గడియ వేసి, రోజు కంటే మెల్లగా వస్తున్నాడు.

ఆశ్చర్యంగా చూస్తోంది.

ఎందుకలా ఉన్నాడు?

వంట్లో బాగా లేదా?

"పార్వతీ! కాసిన్ని మంచినీళ్ళు కావాలి!" నిస్సత్తువగా కుర్చీలో కూలబడుతూ అడిగాడు విశ్వనాథం.

గబగబ నీళ్ళు అందించింది.

నీళ్ళు త్రాగి ఖాళీ గ్లాసు క్రింద ఉంచి, భార్య కళ్ళలోకి సూటిగా చూశాడు.

పార్వతి కళ్ళు బెదురుగా ఉన్నాయి. మనసు కంపిస్తోంది.

"ఈ రోజు ఒక ఘోరం జరిగి పోయింది." విశ్వనాథం గొంతు విచారంగా ఉంది.

"ఏమిటది?" మాటలు గొంతు పెగుల్చుకుని వచ్చాయి పార్వతికి.

"మొన్న మనకి దుప్పటి అరువు కిచ్చాడే-అతనీ రోజు మా ఆఫీసు దగ్గరే హార్ట్ ఫెయిలయి పోయాడు. అతనికి వెనకా ముందు ఎవరూ లేరట! మా వాళ్ళే పూనుకుని అన్నీ పూర్తి చేశారు." దీర్ఘంగా నిట్టూర్చాడు.

పార్వతి నోరు పెగలక అలాగే చూస్తూండి పోయింది. *

---


# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 18 రూ॥ |
| విడి ప్రతి | 3 రూ॥ |